చిత్రలేఖన పోటీలు ప్రారంభం



చిత్రలేఖనం పోటీలను ప్రారంభించిన శివనాగిరెడ్డి

మణికొండ: శివరాత్రిని పురస్కరించుకుని మహాశివుని చిత్రాలను వేసే పోటీలను సోమవారం మణికొండ మున్సిపాలిటీ, సెక్రటేరియట్ కాలనీ కమ్యూనిటీ హాల్లో ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలను ప్రముఖ స్థపతి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. చిత్రలేఖనం మంచి కళ అని దాన్ని ప్రతి సంవత్సరం మహాశివుని చిత్రాలను గీసేందుకు శివరాత్రి పండగ సందర్భంగా పోటీలను నిర్వహించటం మంచి పరిణామన్నారు. కళీపట్నం ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు రాం ప్రతాప్ మాట్లాడుతూ.. ఈ పోటీలో మొత్తం 25 మంది ప్రముఖ చిత్రకారులు పాల్గొంటున్నారన్నారు. శివరాత్రి రోజు వారు గీసిన చిత్రాలతో ప్రదర్శన ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటేరియట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి. మనోహర్, నాయకులు శివరామకృష్ణ, కాంతారావు, వెంకటేశ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫర్నిచర్ గోదాంలో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



బయటకు వచ్చిన అపార్ట్‌మెంట్ వాసులు

మణికొండ: ఓ ఫర్నిచర్ తయారు చేసే గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌వాసులు ఉరుకులు పరుగులు పెట్టారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని కూలీకుదుబ్‌షా కాలనీలో ఓ వ్యాపారి ఫర్నిచర్ తయారు చేసే కేంద్రాన్ని ఏర్పాటు చేశాడు. రోజు మాదిరిగానే సిబ్బంది పని చేస్తుండటంతో ఉన్నట్టుండి మంటలు అంటుకున్నాయి. లెదర్, కట్టెలు, ఫోం లాంటి పదార్థాలు ఉండటంతో గోదాం మొత్తం వ్యాపించాయి. అప్పటికే అగ్నిమాపకశాఖ, నార్సింగి పోలీసులకు సమాచారం ఇవ్వటంతో వారొచ్చి మంటలను ఆర్పేశారు. పక్క అపార్ట్‌మెంట్‌లో ఉన్న రెండు కార్లు వేడికి వెనకభాగం దెబ్బతినగా పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌కు ఉన్న రెండు ఏసీలు ఔట్‌డోర్‌లు కాలిపోయాయి.

నిత్య పరిశోధకుడు, బహుభాషా వేత్త నలిమెల భాస్కర్



చార్మినార్: ఆధునిక తెలుగు సాహిత్యంలో పరిశోధకుడిగా, బహుభాషావేత్తగా, అనువాదకుడిగా, రచయితగా విశేషంగా కృషి చేసి డాక్టర్ నలిమెల భాస్కర్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. సిటీ కాలేజ్ మఖ్దూమ్ మొహియుద్దీన్ జాతీయ పురస్కార ప్రదాన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నిత్యానందరావు మాట్లాడారు. వివిధ భాషాల్లో నిరంతరం కృషి చేస్తున్న నలిమెల భాస్కర్‌కి మఖ్దూమ్ పురస్కారం ప్రదానం చేయడం ఎంతో సముచితమైన నిర్ణయమన్నారు. మన తెలంగాణ సంపాదకుడు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ..మఖ్దూమ్ పేరుతో ఒక జాతీయ పురస్కారాన్ని ఏర్పాటు చేసి, సాహితీవేత్తలకు ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. ప్రముఖ కవి యాకూబ్ మాట్లాడుతూ..స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం గురించి మఖ్దూమ్ చూపిన బాటలో అందరం నడవాలన్నారు. అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ..నలిమెల భాస్కర్ చిన్న వయసు నుంచే పద్య కవిత్వంతో పాటు వచన సాహిత్యంలో కూడా మంచి ప్రతిభ కనబరిచారని, నవలలు కూడా రాశారని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ మాట్లాడుతూ..సిటీ కాలేజ్ పూర్వ అధ్యాపకుడైన మఖ్దూమ్ పేరుతో జాతీయ పురస్కారాన్ని ఉత్తమ సాహితీ వేత్తలకు 2019 నుంచి పురస్కారం ప్రదానం చేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం బహుభాషావేత్త నలిమెల భాస్కర్‌కు అందించడం అవార్డు గౌరవాన్ని పెంచిందన్నారు. ఈ కార్యక్రమాన్ని అవార్డు కమిటీ కన్వీనర్ డా.విప్లవ్ దత్ శుక్లా, సభ్యులు డా.యాదయ్య, డా.కోయి కోటేశ్వరావులు సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ పూర్వ ప్రిన్సిపాల్ డా.వెల్చాల కొండలరావు, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి, అడిషనల్ కలెక్టర్ శ్యామ్ లాల్, వాహేద్, కవయిత్రి విమల, కరీంనగర్ సాహితీ సోపతి మిత్రులు డా.బూర్ల వెంకటేశ్వర్లు, గాజోజు నాగభూషణం, పొన్నం రవిచంద్ర, కందుకూరి అంజయ్య పాల్గొన్నారు.

మహిళ కిడ్నాప్, లైంగిక దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఏసీపీ శ్రీనివాస్

మియాపూర్: రోడ్డుపై నిలబడి ఉన్న మతిస్థిమితం లేని మహిళను బలవంతంగా స్కూటీపై ఎక్కించుకొని కిడ్నాప్ చేసి లైంగిక దాడికి పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్‌రావు ఆ కేసు వివరాలను వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా ఆమీన్‌పూర్ బద్దంకొమ్ములోని మారుతీ హిల్స్ కాలనీకి చెందిన బాలకుమార్ అలియాస్ శివకుమార్(25) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతని స్నేహితుడైన మెదక్ జిల్లా దుర్గాగుడి పెద్దపూర్‌కు చెందిన గౌరగల్ల మహేష్(24)తో కలిసి 21వ తేదీన బ్లాక్ కలర్ స్కూటీపై ఇద్దరూ మియాపూర్ బొల్లారం క్రాస్ రోడ్డు నుంచి బొల్లారం వైపు వెళుతున్నారు. తెల్లవారుజామున 2 గంటల సమయంలో మియాపూర్ క్రాస్ రోడ్డు బస్టాప్ వద్ద ఓ మహిళ(36) ఒంటరిగా కనిపించడంతో బలవంతంగా స్కూటీపై ఎక్కించుకొని వెళ్లారు. ఐలాపూర్ తండా సమీపంలో ఎవరూ లేని ప్రాంతం చూసి ఆ ఇద్దరు మహిళపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆపై ఆమెను వదిలేసి పరారయ్యారు. మహిళపై అత్యాచారం చేసినట్లు పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. ఓ కారు డ్రైవర్ ఇచ్చిన సమాచారం మేరకు కేసు విచారణ భాగంగా మియాపూర్‌లో తనిఖీలు చేస్తుండగా బాలకుమార్, మహేష్‌లను అనుమానించి అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసినట్లు అంగీకరించారు. నిందితుల్లో బాలకుమార్‌పై చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో స్నాచింగ్, రాబరీ, ఇళ్లల్లో దొంగతనాలు, భూతగాదాలు వంటివి 8 కేసులు ఉన్నాయి. మహేష్‌పై ఓ మర్డర్, దొంగతనం కేసులు అల్లాదుర్గం పీఎస్‌లో ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.ఈ విలేకరుల సమావేశంలో సీఐ క్రాంతి కుమార్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

‘ప్రజావాణి’ని సద్వినియోగం చేసుకోవాలి



ఫిర్యాదు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ వెంకన్న



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చంద్రమోహన్ గౌడ్

చార్మినార్: ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న సూచించారు. జోనల్ కమిషనర్ పర్యవేక్షణలో జోనల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫలక్ నుమా సర్కిల్ పరిధిలోని అక్రమ నిర్మాణంపై ఒక్క ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ..బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలపై ప్రజలు ప్రజావాణిలో తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అందిన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శైలజా, ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ రాజారావు, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మాజీద్, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గౌలిపురా డివిజన్‌లో సమస్యలు పరిష్కరించండి

చాంద్రాయణగుట్ట: గౌలిపురా డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి జి.చంద్రమోహన్ గౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం చాంద్రాయణగుట్ట ఫూల్‌బాగ్‌లోని కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ వెంకన్నకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..డివిజన్‌లో నెలకొన్న సమస్యలతో ప్రజలు నిత్యం సతమతమవుతున్నారన్నారు. గుంతలమయంగా మారిన రహదారులు, నోళ్లు తెరిచిన మ్యాన్‌హోళ్లు, పడకేసిన పారిశుద్ధ్యం, ఫుట్‌పాత్‌ల కబ్జా లాంటి సమస్యలు నెలకొన్నాయన్నారు. ఛత్రినాక చౌరస్తాలో ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్ నిర్మించాలన్నారు. వైన్స్, బార్ల ముందు అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకోవాలన్నారు.

శివరాత్రికి సిద్ధమవుతున్న దేవాలయాలు




మచిలేశ్వరస్వామి

- రంగురంగుల విద్యుత్ దీపాలు
- ఆవరణలో చలువ పందిళ్లు
- తెల్లవారుజాము నుంచే అభిషేకాలు

మణికొండ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న బుధవారం ప్రత్యేక పూజలు అందుకునేందుకు గండిపేట మండల పరిధిలోని శైవ క్షేత్రాలు సిద్ధమవుతున్నాయి. దేవాలయాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మణికొండ పార్వతీరామలింగేశ్వరాలయం, పుప్పాలగూడ కాశీవిశ్వేశ్వరాలయం, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల మచిలేశ్వరాలయాలను ఉత్సవాలకు సిద్ధం చేస్తున్నారు. ఆయా దేవాలయాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆయా దేవాలయాల వద్ద రంగురంగుల దీపాలు, కటౌట్‌లు భక్తులను విశేషంగా ఆకర్షించేలా ఏర్పాటు చేస్తున్నారు. అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తులను దృష్టికి ఉంచుకుని క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నామని ఆలయ ధర్మకర్తలు, పాలక కమిటీ సభ్యులు పేర్కొంటున్నారు.

ప్రత్యేక పూజలు ఇవే..

మహాశివరాత్రి పండగను పురస్కరించుకుని ఆయా శివాలయాలలో ఉదయం 4 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అభిషేకాలు కొనసాగుతాయని అర్చకులు తెలిపారు. అనంతరం పుప్పాలగూడ, మంచిరేవులలో కేవలం దర్శనాలు మాత్రమే కొనసాగనున్నాయి. మణికొండలో సాయంత్రం 4 గంటల నుంచి దర్శనాలు, సాయంత్రం 7 గంటలకు స్వామి వారి పల్లకీసేవ, రాత్రి 9 గంటలకు కల్యాణం, రాత్రి 12 గంటలకు ఆయా దేవాలయాలల్లో లింగోద్భావ కాల మహాన్యాస కపూర్వ రుద్రాభిషేకాలు కొనసాగుతాయన్నారు. మంచిరేవులలో రాత్రి 9 గంటలకు పార్వతీ పరమేశ్వర కల్యాణం, లింగోద్భవ కాల రుద్రాభిషేకం నిర్వహిస్తారు.



శివరాత్రి పూజలకు ముస్తాబైన పుప్పాలగూడ కాశీవిశ్వేశ్వరాలయం

రాజేంద్రనగర్ పరిధిలో..

రాజేంద్రనగర్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్ పరిధిలోని శివాలయాలను ముస్తాబు చేస్తున్నారు. ఇప్పటికే దేవాలయాలను వివిధ రంగులతో అందంగా తీర్చిదిద్దారు. గత రెండు రోజులుగా దేవాలయాలకు విద్యుత్ దీపాలతో అందంగా అలంకరిస్తున్నారు. రాజేంద్రనగర్ పరిధిలో ఉన్న శివాలయాలకు మహా శివరాత్రి సందర్భంగా వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు.



విద్యుత్ దీపాలతో శివాలయం

రాంబాగ్ చిన్న అనంతగిరి దేవాలయంలో

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలోని రాంబాగ్ చిన్న అనంతగిరి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేసినట్లు హైదర్‌గూడ శ్రీ ప్రణవ భక్త సమాజం అధ్యక్షులు మోంద్ర నర్సింహా అన్నారు. సోమవారం దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25 నుంచి 27 వరకు మహాశివరాత్రి మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్, కృష్ణ, మల్లారెడ్డి, హరినాథ్, మల్లారెడ్డి, కొమురయ్య, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై చర్చిస్తున్న సభ్యులు



మణికొండ శివాలయం

నకిలీ పట్టాదారులపై కేసు నమోదు

ఫిర్యాదు చేసిన శేరిలింగంపల్లి సర్కిల్ ఉపకమిషనర్

గచ్చిబౌలి: తెలంగాణ ప్రభుత్వం గతంలో పేద, మధ్య తరగతి వారికి జీఓ నంబర్ 58,59 ద్వారా లబ్ధి చేకూరుస్తూ పట్టాలు అందజేసింది. అంజయ్యనగర్‌లో నకిలీ పట్టాల పేరిట ఇళ్లను నిర్మిస్తున్నట్లుగా ఫిర్యాదులు అందడంతో రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గచ్చిబౌలి సర్వే నంబర్లు 134,135, 136 పరిధిలోకి వచ్చే అంజయ్యనగర్‌లో జీఓ నంబర్ 58,59 ద్వారా జారీ చేసిన పట్టాలలో నకిలీవి ఉన్నాయంటూ శేరిలింగంపల్లి సర్కిల్ ఉపకమిషనర్ ముకుంద రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టాలు అందుకున్న 34 మంది లబ్ధిదారులకు నోటీసులు జారీ చేశారు. 27 మంది ఇప్పటి వరకు సమాధానం ఇవ్వగా అందులో నాలుగు పట్టాలు నకిలీవని తేలినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మరో ఏడు మంది జవాబు ఇవ్వాల్సి ఉందని ఉపకమిషనర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో రాయదుర్గం పోలీసులు ఫోర్జరీ, చీటింగ్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

అఫ్జల్‌గంజ్: అకారణంగా తమపై దాడికి పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అఫ్జల్‌గంజ్‌లోని మజీద్ ఏ ఛమన్ అధ్యక్షుడు యూనిస్ అహ్మద్ ఆధ్వర్యంలో ప్రతినిధులు బృందం సోమవారం అఫ్జల్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అఫ్జల్‌గంజ్ మార్కెట్‌కు సంబంధం లేని కొంత మంది తమపై అకారణంగా దాడి చేశారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.

చెరువు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న శ్రీధర్

రాజేంద్రనగర్: పత్తికుంట చెరువు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ సర్కిల్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు. ఈ మేరకు సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన నాయకులతో కలిసి డిప్యూటీ కమిషనర్ డాక్టర్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వై.శ్రీధర్ మాట్లాడుతూ..పత్తికుంట చెరువు కలుషితం కావడంతో హనుమాన్‌నగర్ డ్రైనేజీ సివరేజ్ పూర్తిగా గుర్రపు డెక్క పెరిగి నీరు కలుషితం అవుతున్నాయన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనం మంచినీరులో చేస్తున్నామంటే అది రాజేంద్రనగర్ హనుమాన్‌నగర్ మాత్రమే అన్నారు. అది కూడా రానున్న రోజుల్లో కలుషితం కానుందన్నారు. రాబోయే రోజుల్లో మానస హిల్స్, ఉర్జిత విల్లాస్ లాంటి వాటితో పత్తికుంట కలుషితం అయ్యే అవకాశముందని..ముందు జాగ్రత్తగా కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు జి.బాబురావు, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఇ.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

- పరారీలో మరో ఇద్దరు నిందితులు
- కేసు వివరాలను వెల్లడించిన ఏసీపీ శ్రీనివాస్‌రావు

మియాపూర్: చేతబడి చేయడంతోనే తన తండ్రి కాళ్లు, చేతులు పడిపోయాయని, సోదరి పెళ్లి ఆగిపోవడం, తన అనారోగ్యానికి కారణం అనే అనుమానంతో ఓ వ్యక్తిపై కక్ష పెంచుకొని నలుగురు స్నేహితులతో కలిసి కర్రలతో కొట్టి హత్యచేసిన ముగ్గురు వ్యక్తులను చందానగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇరువురు పరారీలో ఉన్నారు. మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ హత్యకేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వివరాలు ఇలా..

చందానగర్ పాపిరెడ్డి కాలనీలో నివాసముంటున్న ఎండీ నజీర్(41) కారు డ్రైవర్. నెహ్రూనగర్‌కు చెందిన ఎండీ ఫక్రుద్దీన్(28) స్థానికంగా ఎలక్ట్రీషియన్. ఇద్దరూ చిన్ననాటి నుంచి స్నేహితులు. ఇటీవల నజీర్ చేతబడి చేస్తున్నట్టు ఇరుగుపొరుగు వారు చెప్పడంతో పక్రుద్దీన్‌కు నజీర్‌పై అనుమానం మొదలై, ఇద్దరి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఫక్రుద్దీన్ తండ్రి మోహీద్‌బేగ్‌కు కాళ్లు, చేతులు పనిచేయకపోవడానికి నజీర్ చేతబడి కారణమని భావించాడు. నెల రోజుల క్రిందట ఫక్రుద్దీన్ సోదరి ఎంగేజ్‌మెంట్ జరిగింది. ఈ నిశ్చితార్థానికి వచ్చిన నజీర్ 15 రోజుల్లో చెల్లి పెళ్లి ఆగిపోతుందని చెప్పాడు. అదే జరిగింది. పైగా ఫక్రుద్దీన్ కూడా అనారోగ్యానికి గురికావడంతో నజీర్‌పై తీవ్ర అనుమానం ఏర్పడింది. దీంతో నజీర్‌తో పలుమార్లు గొడవలు పడ్డారు. ఎలాగైనా నజీర్‌ను చంపాలని కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఫక్రుద్దీన్ అదే కాలనీకి చెందిన స్నేహితుడు ఐటీ ఉద్యోగి మహ్మద్ అలీకి విషయం తెలిపాడు. దీంతో అలీ చందానగర్ బాబునగర్‌కు చెందిన రౌడీషీటర్ ఎండీ బురాన్‌ను కలిసి జరిగిన విషయాలను ముగ్గురు ప్రస్తావించారు. నజీర్‌కు, ఎండీ బురాన్‌కు రియల్ ఎస్టేట్ వ్యాపార విషయంలో డబ్బులు ఇచ్చిపుచ్చుకోవడంలో గొడవలు జరుగుతున్నాయి. నజీర్‌పై కోపం ఉందని తనతో కూడా గొడవపడుతున్నాడని ఎండీ బురాన్ వారికి తెలిపారు. దీంతో ఫక్రుద్దీన్, అలీ, బురాన్‌లు కలిసి పథకం ప్రకారం ఈనెల 21వ తేదీన రాత్రి 8:30 గంటల సమయంలో నజీర్‌ను ఫక్రుద్దీన్ శేరిలింగంపల్లి గోపీనగర్ చెరువు కట్ట వద్దకు తీసుకువెళ్లాడు. ఆ తర్వాత వారి స్నేహితులు అలీ, బురాన్, మహ్మద్ ఖలీమ్ , అజర్‌లను పిలిచారు. వీరందరు కలిసి చెరువు కట్టపై మద్యం సేవించారు. తర్వాత ఫక్రుద్దీన్ కుటుంబంపై చేతబడి చేస్తున్నావని నజీర్‌పై గొడవకు దిగారు. ఆ సమయంలో ఫక్రుద్దీన్ పథకం ప్రకారం నజీర్ తలపై కర్రతో గట్టిగా కొట్టాడు. మిగతా స్నేహితులు కూడా నజీర్‌ను కర్రలతో తీవ్రంగా కొట్టారు. దెబ్బలు తాళలేక పక్కనే ఉన్న గోపీనగర్ బస్తీవైపు పరిగెత్తాడు. అతని అరుపులు విని కాలనీవాసులు ఆస్పత్రికి తీసుకెళ్లమని హెచ్చరించారు. దీంతో అలీ, బురాన్, ఖలీమ్ , అజర్‌లు అక్కడి నుండి వెళ్లిపోగా ఫక్రుద్దీన్ గాయాలై అపస్మారక స్థితిలో పడి ఉన్న నజీర్‌ను వెనకాల ఎక్కించుకుని సమీపంలోని హైటెక్ బావర్చీ వద్దకు వచ్చి మళ్లీ స్నేహితులకు ఫోన్ చేశాడు. దీంతో అందరూ కారులో రాగా ఫక్రుద్దీన్ నజీర్‌ను కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్లి అక్కడ చేర్పించి పారిపోయాడు. గాయాలతో ఉన్న నజీర్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు చందానగర్‌కు చెందిన నజీర్‌గా గుర్తించారు. చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా హత్యలో ప్రధాన నిందితుడైన ఫక్రుద్దీన్, రౌడీ షీటర్ బురాన్, ఖలీమ్‌లను అరెస్ట్ చేసి విచారించగా హత్య చేసినట్టు అంగీకరించారు. ఈ హత్యలో పాల్గొన్న హాఫీజ్‌పేట్‌కు చెందిన అజర్, గోపీనగర్‌కు చెందిన మహ్మద్ అలీ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మణికొండ: ఫీడర్‌లలో మెయింటెనెన్స్ పనులు, సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులు చేపడుతున్నందున మంగళవారం రెండు ఫీడర్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ మణికంఠ తెలిపారు. నార్సింగి సబ్‌స్టేషన్ పరిధిలోని నార్సింగి గ్రామం, నార్సింగి హైట్స్ కాలనీ, క్యూబా కాలనీ, ఖాస్యా కాలనీ, వివేకానందనగర్ కాలనీలలో ఉ.11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

అత్తాపూర్: శిథిలావస్థకు చేరిన రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థను ఆధునికరించేందుకు రూ.1.16 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్ తెలిపారు. సులేమాన్‌నగర్ డివిజన్ చింతల్‌మెట్‌లో అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో కలిసి ఆయన పర్యటించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నవాజుద్దీన్, మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

యూనిఫామ్‌ల అందజేత



మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి సోమవారం యూనిఫామ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారుల విద్యాభ్యాసానికి ప్రాధాన్యం ఇస్తూ ఆటల ద్వారా బోధన కొనసాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అనిత, హెల్పర్ సంగీత పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు



అత్తాపూర్: గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్‌ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అత్తాపూర్ సమీపంలో రాంబాగ్ కాలనీలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేసి 1.6 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. విశాల్‌సింగ్‌ను అరెస్టు చేశామని అశ్విన్, నవీన్ పరారీలో ఉన్నట్లు టీం లీడర్ అంజిరెడ్డి తెలిపారు.

28 నుంచి బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు

రాయదుర్గం: గోపన్‌పల్లితండాలో ఈదమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఆలయంలో ఉదయం గోపూజ, అఖండ దీపారాధన, గణపతిపూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, సాయంత్రం యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠాపన, వాస్తు పూజ, అంకురార్పణ శాంతి హోమాలు నిర్వహిస్తారు. శనివారం ఉదయం 7 గంటలకు సర్వదేవతా మండప ఆరాధన, కలశ ఆరాధన, పంచగవ్యాదివాసం, క్షీరాదివాసం, జలాదివాసం, ప్రధాన హోమాలు, సాయంత్రం 4 గంటలకు అమ్మవారికి ఊరేగింపు, గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఆదివారం సర్వదేవతా మండప ఆరాధన, మహాపూర్ణాహుతి, బోనాల సమర్పణ, ఒడిబియ్యం, అన్నదానం, సాయంత్రం 6 గంటలకు సామూహిక కుంకుమార్చన, రాత్రి 7.30 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

వినతి

రాయదుర్గం: టీఎన్‌జీఓ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరాను మెరుగుపర్చాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా టీఎన్‌జీఓ కాలనీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జి జంగయ్య, సభ్యులు సోమవారం జలమండలి అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. వేసవిలో ప్రతియేటా నీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో పలుచోట్ల రోడ్లపైకి మురుగునీరు పారుతోందని, దుర్గంధం భరించలేకపోతున్నామని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని కోరారు.

గ్రామీణ ప్రాంతాల నుంచి నూతన ఆవిష్కరణలు రావాలి

రాయదుర్గం: గ్రామీణ ప్రాంతాల నుంచి నూతన ఆవిష్కరణలు రావాల్సిన అవసరం ఉందని కలామ్ స్ఫూర్తి యాత్ర నిర్వాహకులు పేర్కొన్నారు. రాష్ట్రంలో కలామ్ స్ఫూర్తి యాత్రను ముగించుకొని సోమవారం టీ వర్క్స్‌కు చేరుకున్న వారిని ఘనంగా సత్కరించారు. టీ వర్క్స్ ప్రాంగణంలో తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ ఇంటీరియమ్ సీఈఓ మెరాజ్‌ఫహీమ్ పూలమాలలతో సత్కరించారు.